తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలు గేటు వరకూ
ప్రతి 20 నిముషాలకు ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మరమ్మతులు నిమిత్తం నిడదవోలు రైల్వే గేటును ఫిబ్రవరి ఎనిమిదో తేదీ వరకూ మూసివేస్తున్నందున తాడేపల్లిగూడెం నుండి రాజమండ్రి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నిడదవోలు గేటు వరకూ తాడేపల్లిగూడెం నుంచి ప్రతి 20 నిమిషాలకు బస్సు నడపనున్నట్లు ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ తెలిపారు. గేటు అవతల నుంచి నిడదవోలు డిపో బస్సులు రాజమండ్రి వరకూ వెళ్తాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని డిఎం కోరారు.

రైల్వే లైన్లు పట్టాలెక్కేనా..!

రూటు మారిన కొవ్వూరు-భద్రాచలం లైన్
సత్తుపల్లి-కొవ్వూరు లైన్‌కు కొత్త ప్రతిపాదన
కొత్త ప్రతిపాదనలకైనా నిధులొచ్చేనా
కదలిక లేని కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పనులు
ఈ బడ్జెట్‌లోనైనా నిధుల కేటాయింపు జరిగేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దశాబ్దాలుగా కలగా ఉన్న రైల్వేలైన్లకు ఈ ఏడాదైనా కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ జిల్లావాసుల్లో నడుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2023-24కు సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీంతో జిల్లాకు సంబంధించిన రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు చేస్తారా లేక ప్రతియేటా మాదిరిగా ఊసేకుండా పోతుందనే చర్చ మళ్లీ మొదలైంది. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ నిర్మాణం జిల్లావాసులకు నాలుగున్నర దశాబ్దాల కల. ఖమ్మం, పశ్చిమ ఏజెన్సీలో ప్రయాణ సౌకర్యాన్ని, వివిధ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం తీసుకెళ్లే రవాణా సౌకర్యాన్ని కల్పించే రైలు మార్గం ఇది. 1965 నుంచి ఈ రైల్వే లైన్ నిర్మించాలని డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో కొవ్వూరు, పంగిడి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, రాయవరం మీదుగా 155.6 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మించి మార్గమధ్యంలో 16 స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ లైన్ నిర్మాణం జరిగితే కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ నుంచి బొగ్గును నేరుగా రైల్వే ద్వారా విశాఖ, హైదరాబాద్‌కు పంపడానికి వీలుంటుంది. ఈ రైల్వేలైన్‌కు సంబంధించిన ఖర్చులో 50 శాతం వాటా రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. 2014లో రాష్ట్ర విభజన జరగడం, మోడీ సర్కార్ అధికారంలోకి రావడంతో ఈ రైల్వేలైన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసింది. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ జిల్లావాసులు ఈ రైల్వేలైన్‌కు నిధులు కేటాయిస్తుందని ఆశపడి భంగపడటం పరిపాటిగా మారింది. అయితే కొవ్వూరు-భద్రాచలం లైన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసి దానికి బదులు కొత్త ప్రతిపాదనలను రైల్వేశాఖ తెరపైకి తెచ్చినట్లు తెలిసింది.

కొత్త రైల్వేలైన్ ప్రతిపాదనలు ఇలా..

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి సత్తుపల్లి మీదుగా రైల్వేలైన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇలా చేస్తే భద్రాచలం నుంచి సత్తుపల్లి వరకూ భూసేకరణకు సంబంధించిన నిధులు తామే సమకూరుస్తామని సింగరేణి కాలరీస్ ముందుకొచ్చినట్లు చెబుతున్నారు. ఈ మార్గం నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో దాదాపు రూ.607 కోట్లు భరించేందుకు సింగరేణి కాలరీస్ సిద్ధపడినట్లు సమాచారం. దీంతో కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ను పక్కన పెట్టేసినట్లు చెబుతున్నారు. కొత్తగా ప్రతిపాదించిన రైల్వేమార్గం 118 కిలోమీటర్లుగా తేల్చారు. దీనిలో తెలంగాణలో 48.9 కిలోమీటర్లు, ఏపీలో 70 కిలోమీటర్లు ఉంది. ఈ రైల్వేలైన్‌కు మొత్తం రూ.మూడు వేల కోట్లు ఖర్చు కానున్నట్లు ప్రతిపాదనలు సైతం తయారైనట్లు సమాచారం. ఈ రైల్వేలైన్‌కు కూడా తెలంగాణ, ఎపి కొంత వాటా చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాలేదని సమాచారం. దీంతో కేంద్రమే పూర్తిస్థాయి ఖర్చును భరించేలా మరో ప్రతిపాదన తయారు చేసినట్లు చెబుతున్నారు. కేంద్రం చేపడుతున్న సాగరమాల ప్రాజెక్టులో ఈ రైల్వేలైన్ చేర్చాలని చూస్తున్నట్లు సమాచారం. దీనికి కేంద్రం సిద్ధపడుతుందా లేదా అనేది ఈ బడ్జెట్‌లో తేలనున్నట్లు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం నిర్మితమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సమాంతరంగా ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగేవిధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్‌గా మార్పు చేస్తే.. కొత్త ప్రతిపాదనలకైనా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగేనా అనేది వేచిచూడాలి.

కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం కలిగేనా

ఉమ్మడి జిల్లాలో మరోముఖ్యమైన రైల్వే మార్గం కోటిపల్లి-నరసాపురం. ఈ రైల్వేలైన్‌ను 2000-2001లో ప్రతిపాదించారు. లోక్‌సభ స్పీకర్ బాలయోగి హయాంలో ఇది తెరపైకి వచ్చింది. మొత్తం 57 కిలోమీటర్ల పొడవునా ఈ రైల్వే లైన్ నిర్మాణం జరగాల్సి ఉంది. మొత్తం రూ.2,120 కోట్లు అంచనాతో ఈ రైల్వేలైన్ ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అంచనా వ్యయం ఇంకా పెరిగే అవకాశం ఉంది. గోదావరిపై మూడుచోట్ల బ్రిడ్జిల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఈ రైల్వేలైన్ ఒక్క అడుగు కూడా ముందుకు పడిన పరిస్థితి లేకుండాపోయింది. నిధుల కేటాయింపునకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ రైల్వేలైన్‌కు సంబంధించి 50 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగితే విజయవాడ నుంచి విశాఖ రైల్వేలైన్ మాదిరిగా మరో రైల్వేలైన్ ఏర్పాటవుతోంది. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల రవాణా మరింత తేలికవుతుంది. ఈ బడ్జెట్‌లోనైనా కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం కలిగేనా అనే చర్చ జిల్లావాసుల్లో నడుస్తోంది.

జిఒ 1 రద్దు కోరుతూ నిరసన



నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకురూరల్

జిఒ నెం.1ని రద్దు చేసి రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, పౌరహక్కుల సంఘం, అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద జిఒ నెం.1 రద్దు చేయాలని కోరుతూ నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయకుండా వాటికి తూట్లు పొడుస్తుందన్నారు. జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గోపిరెడ్డి చిన్నారావు, గోపాల శ్రీను, తోట ఏసు, సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపి, జనసేన నాయకులు అనుకుల రమేష్, కాంగ్రెస్ నాయకులు డి.రామకృష్ణ, న్యాయవాది ఉడతల పుల్లేశ్వరరావు, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జగనన్న చేదోడు.. ఎంతోమందికి తోడు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న చేదోడు పథకం అన్ని వర్గాల వారికి తోడుగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు జగనన్న చేదోడు మూడో విడత ఆర్థిక సాయానికి సంబంధించిన నమూనా చెక్కును సోమవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ షాపులు కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు జగనన్న చేదోడు పథకం కింద ప్రతియేటా రూ.10 వేల చొప్పున ఐదేళ్ల పాటు ఆర్థిక సాయాన్ని అందజేస్తారన్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి 10,348 మంది లబ్ధిదారులకు రూ.10.35 కోట్లు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. దీనిలో రూ.4.51 కోట్లు 4,507 మంది టైలర్లకు, రూ.4.05 కోట్లు 4,050 మంది రజకులకు, రూ.1.80 కోట్లు 1,791 మంది నాయీ బ్రాహ్మణుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ సంక్షేమ శాఖ ఎఇఒ కె.ప్రమీలరాణి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పి.గౌరీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బి.పూర్ణచంద్రరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేశచరిత్రలో గాంధీ హత్య అత్యంత బాధాకరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం



నివాళులర్పిస్తున్న సీతారాం, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

దేశ చరిత్రలో గాంధీ హత్య అత్యంత బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థకు చెందిన నాథూరాం గాడ్సే 75 ఏళ్ల క్రితం అత్యంత పాశవికంగా జాతిపిత మహాత్మాగాంధీని తుపాకీతో కాల్చి చంపారన్నారు. నాటి గాడ్సే వారసులే నేడు దేశాన్ని పాలించడం బాధాకరం, ప్రమాదకరం అని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదంతో ఎనిమిదేళ్లుగా దేశవ్యాప్తంగా అలజడులు సృష్టిస్తూ, ప్రజల మధ్య చీలకలు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మతోన్మాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాస్వామికవాదులు, యావత్ భారత ప్రజానీకం అంతా ఏకమై పెద్దఎత్తున ఉద్యమాలు సాగించాలన్నారు. దేశం సమగ్రతను, సమైక్యతను కాపాడుకోవాలన్నారు. దేశ పురోభివృద్ధికి, ప్రగతిశీలతకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆటంకంగా మారిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా నాట్లు పూర్తయినప్పటికీ ఇంకా కొన్నిచోట్ల సార్వా ధాన్యం కొనుగోలు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం బకాయిలను వెంటనే రైతులకు అందించాలన్నారు. అదేవిధంగా దాళ్వాలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించి కొనసాగించాలన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ప్లాట్లు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.అజయకుమారి, గొర్ల రామకృష్ణ, ఎం.రామాంజనేయులు, ఎం.త్రిమూర్తులు, జవ్వాది శ్రీనివాస్, బి.జార్జి, కె.బాలరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, కె.తవిటినాయుడు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

కలెక్టర్ ప్రశాంతి


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

గాంధీ మార్గం అనుసరణీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గాంధీజీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ ప్రశాంతి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సముపార్జించిన గొప్ప వ్యక్తి గాంధీ అని కొనియాడారు. సత్యం, అహింస మార్గాలనే ఆయుధంగా చేసుకొని స్వాతంత్రం కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు: కలెక్టర్

జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి సబ్‌కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిరోధానికి కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ సభ్యులు బాల్య వివాహాలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరగడానికి కారణాలను విశ్లేషించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలు పాల్గొన్నారు.

రీసర్వే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి

జిల్లాలో రెండో విడత రీసర్వే ప్రారంభమైందని, ఇది డిసెంబరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. కాళ్ల, ఆకివీడు మండలాల్లో భూతగాదాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ రెండు మండలాల్లో రీసర్వే తొలుత పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేలో ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు జిరాయతీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఇళ్ల నిర్మాణంపై ఆమె మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. గ్రామాలు, అర్బన్ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకు రావాలన్నారు.

స్పందనకు ప్రతిస్పందన వేగంగా ఉండాలి : కలెక్టర్ ప్రశాంతి

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

స్పందనకు ప్రతిస్పందన అంతే వేగంతో ఉండేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 243 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దరఖాస్తు అధికారికి చేరిన వెంటనే అదే వేగంతో సమస్య పరిష్కారంతో కూడిన జవాబును దరఖాస్తుదారునికి పంపాలన్నారు. కొన్ని శాఖల్లో స్పందన దరఖాస్తులు నిర్ణీత గడువు దాటి ఎందుకు పరిష్కారం కావడం లేదని ప్రశ్నించారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం జగనన్న లేఅవుట్లలో సిమెంట్ బ్రిక్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. ప్రస్తుతం భీమవరంలో బ్రిక్ యూనిట్ ప్రారంభించామన్నారు.

జాతీయ కుష్టువ్యాధి నివారణ పక్షోత్సవాలు

స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో కలెక్టర్ ప్రశాంతి పాల్గొని మాట్లాడారు. కుష్టు వ్యాధి నియంత్రణలో ఉందనుకునే సమయంలో ఇప్పుడు మళ్లీ కుష్టు కేసులు ఎక్కువవుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా కుష్టు వ్యాధి నివారణకు తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు అధికారులతో కుష్టువ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.5,56,460 అందజేత

డిఆర్‌డిఎ ద్వారా రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ టైం మెంబర్‌షిప్ రూ.1,100, లైఫ్ అసోసియేట్స్ మెంబర్‌షిప్ రూ.410 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ.5,56,460 చెక్కును డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ పి.ప్రశాంతికి అందజేశారు. ఈ మొత్తాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల్లోని ఎపిఎంలు, సిసిఎస్‌లు, విఒఎల సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిపిఒ ఎన్.నాగలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం: అర్జీలను ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన 28 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని ఆదేశించారు.

నినదిస్తున్న నేతలు, విద్యార్థులు

ప్రత్యేక హోదాపై నిలదీయాలి

విద్యార్థి, యువజన సంఘాలు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని హామీలు గుప్పించి అధికారంలోకొచ్చిన అవకాశవాద రాజకీయ పార్టీలను విద్యార్థులు, యువత ప్రశ్నించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సమర యాత్ర ఈ నెల 31న మంగళవారం భీమవరం రాబోతున్న సందర్భంగా సోమవారం స్థానిక ఎంవిఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన సన్నాహక సభ జరిగింది. తొలుత విద్యార్థులు గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం భీమవరం బస్టాండ్ వద్ద కేశవరావు హైస్కూలు గ్రౌండ్‌లో జరగనున్న బహిరంగసభలో జిల్లాలోని యువత, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.సుభాష్, ప్రసాద్, జయరాజు, నరేష్, జ్యోతి, కిరణ్మయి పాల్గొన్నారు.

పరిశోధన, అభివృద్ధి పాత్ర కీలకం

అమెరికా పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొత్తపల్లి రాజశేఖర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

దేశ పురోగతిలో పరిశోధన, అభివృద్ధి పాత్ర ఎంతో కీలకమని అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొత్తపల్లి రాజశేఖర్ సూచించారు. ఎపి నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసోసియేషన్, ఎఐఅండ్‌రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవాళి ఆరోగ్యానికి సంబంధించి అమెరికాలో కాంతి, ధ్వని తరంగాల ఆధారిత బయోమెడికల్ ఇంజినీరింగ్ ఉత్పత్తులపై విస్తృత పరిశోధనలు చేస్తున్న రాజశేఖర్ ఈ కార్యకమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎపి నిట్‌తోపాటు బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ సైన్స్, హైదరాబాద్ ఐఐటితో కలిసి ఆయన సంయుక్త పరిశోధనలు చేస్తున్నారు. పారదర్శకమైన, బయో కాంపాజిబుల్ అల్ట్రాసౌండ్ ట్రాన్స్‌డ్యూసర్ చిప్‌ను అభివృద్ధి చేసినందుకుగాను అమెరికా ప్రభుత్వం నుంచి అత్యున్నతమైన ఇండిపెండెట్ గ్రాంటును పొందారు. దీంతోపాటు నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) నుంచి కెరియర్ అవార్డును కూడా అందుకున్నారు. భవిష్యత్తులో అల్ట్రా సౌండ్ చిప్ సహాయంతో కేన్సర్, మెదడు, గుండెకు సంబంధించి రక్తనాళాలు గడ్డ కట్టకుండా ఉండేందుకు, ఈ పరికరాలను తక్కువ ఖర్చుతో ఒకచోట నుంచి మరోచోటుకు సామాన్యులు కూడా సులువుగా తీసుకెళ్లేలా విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేయాలన్నా, పిహెచ్‌డి, ఎంఎస్ వంటి ఉన్నత కోర్సులు చదవాలన్నా మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో నిలబడాలంటే తమ శక్తి, సామర్థ్యాలను తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిందేనని చెప్పారు. విద్యార్థులు కళాశాలలో చేరినప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. వినూత్న ఆలోచనలు చేస్తూ ఎవరైతే ప్రయోగశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారో వారు తప్పకుండా ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. ఇతర దేశాల్లోని విద్యా, ఉపాధి అవకాశాలు, వాటి విధి, విధానాల గురించి వివరించారు. ముందుగా రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ఇతర దేశాల్లోని విశ్వవిద్యాలయాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూనే ఉంటామని వివరించారు. విద్యార్థుల సందేహాలను రాజశేఖర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబి వీరేష్ కుమార్, డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ ఫణీకృష్ణ కర్రి, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు



రంగరాజును సత్కరిస్తున్న సభ్యులు

కార్టూనిస్ట్ రంగరాజుకు సత్కారం

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో సేవలందించడమే కాకుండా విభిన్న రంగాల్లో తన ప్రతిభా పాటవాలు చూపుతున్న ప్రముఖ కార్టూనిస్ట్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు అభినందనీయులని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఉండి ప్రాంతీయ పశువైద్యశాలలో పశు సంక్షేమ పక్షోత్సవాల సంబరాల వేదికపై ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ రంగరాజు మాస్టారు ఇటీవల ఉభయ రాష్ట్రాల కవితల పోటీల్లో ప్రత్యేక బహుమతి సాధించి మండలానికే కాదు రాష్ట్రానికే వన్నె తెచ్చారని తెలిపారు. సహాయ సంచాలకులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ కార్టూన్ సంకలనంలో ఆయన వేసిన కార్టూన్ చోటు చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కలిదిండి సీతారామరాజు, రుద్రరాజు నరసరాజు, ఎం.శివరామరాజు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిత్ర లేఖనంలో శృంగవృక్షం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకోడేరు

చిత్రలేఖనం పోటీల్లో శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నెల్లూరులో ఇటీవల నిర్వహించిన 7వ అఖిలభారత స్థాయి చిత్రకళ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మూన్ స్లేఫ్ చిత్రం గీసిన తాడిపాక కెజియాకు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా గోల్డ్ మెడల్ సాధించారు. ద్వితీయ బహుమతులను దైవాల లోహిత్శ్రీ, గంగనేని నెహాల్ బంగారుబాబు, తంగేళ్ల మానస శ్రీవల్లి, లంకపల్లి ప్రణీత్కుమార్, వేండ్ర పూర్ణ వెంకట్, పి.ఉషా, దైవాల సాయి కృష్ణ వీరపల్లి జనని, వీరవల్లి గుణరంజిత్ అమీర్ ఆర్ట్ అకాడమీ అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగన్నాథరావు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుని కుటుంబానికి తాతాజీ పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని దేవునితోటకు చెందిన తృటపల్లి ప్రసాద్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. తాతాజీ వెంట అనిశెట్టి పెంటయ్య, పెట్ట మూర్తి, చెన్ను విజయ్, హరికృష్ణ ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని తక్షణం ఆదుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. సోమవారం బాధితులు పిచ్చెట్టి సత్యనారాయణ కుటుంబాన్ని టిడిపి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి టిడిపి తరుపున రూ.16 వేల నగదు సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దిగుమర్తి సూర్యకుమారి, టిడిపి నాయకులు బికిడి.ప్రసాద్, దొంగ నాగార్జున, కనపాల వెంకటేశ్వరరావు సత్యనారాయణ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న తహశీల్దార్

అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

కష్టపడి పని చేస్తే ఫలితం ఉంటుందని తహశీల్దార్ దండు వెంకట సత్య సూర్యఅశోక్ వర్మ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జీ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వై.అప్పారావు, మండల డిప్యూటీ సర్వేయర్ డి.దుర్గా ప్రసాద్, విలేజ్ సర్వేర్ చల్లారెడ్డి, విఆర్ఒ గోపాలకృష్ణ, విఆర్ఎ బి.చిన గంగాధర్ను సత్కరించి తహశీల్దార్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.ఏలియమ్మ, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, విఆర్ఒలు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్లో ఆధునికీకరించిన డ్వామా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఆధునికీకరించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఛాంబర్ను డిఆర్ఒ దాసిరాజుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా విభజన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డ్వామా కార్యాలయానికి గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో కొన్ని మరమ్మతులు, ఛాంబర్ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తి కావడంతో కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్టివి.రాజేశ్వరరావు, జూనియర్ ఇంజినీర్లు శ్రీనివాస్, ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రవీణ్, ఒమేగా రావు పాల్గొన్నారు.

డ్వామా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని తహశీల్దార్ షేక్ హుస్సేన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తహశీల్దార్ మాట్లాడారు. గాంధీజీ బాటలో నడిచి ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి డిఎల్పిఒ రెడ్డియ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంకా గుప్త, సీమకుర్తి బాలాజీ, మానేపల్లి చిన్న, కారుమూరి రవి, నాగబాబు, రమేష్, అనంతపల్లి అనిల్ పాల్గొన్నారు.

అత్తిలి : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎంపిడిఒ వివిఎస్.రామారావు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

పోడూరు : గాంధీజీకి నివాళులర్పిస్తున్న స్కూల్ యాజమాన్యం

కార్యక్రమంలో ఎంపిపి మక్కా సూర్యారావు, ఎంపిటిసిలు, సర్పంచులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ భవనం ఆవరణలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించి రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఇ.రాజేష్, కార్యదర్శి పలివెల శివ, కోశాధికారి చవ్వా సతీష్కుమార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ సారథ్యంలో నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోనం వెంకట్రావు, వర్ధనపు కాసు, కె.అర్జున్రావు పాల్గొన్నారు.

పోడూరు : గాంధీజీ వర్ధంతి గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వర్ధనపు కాసు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పీటర్సన్ శాంతాగ్రేస్, వైసిపి నాయకులు గొట్టుముక్కల రమేష్, జనసేన జిల్లా సహాయ కార్యదర్శి రావి హరీష్ బాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

సంక్షేమ పాలన అందించడమే జగనన్న లక్ష్యం

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం ఆచంట పంచాయతీ పరిధి పైపోర, కిందపోర, కవురుపాలెం, చెమ్మచెరువు గ్రామంలో 124వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గ్రామంలో జరిగిన సంక్షేమ అభివృద్ధిని వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోమని ఆదేశించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ ఒకే ఒక్కడని తెలిపారు. దళిత, బడుగు బలహీన వర్గాల, అగ్రవర్ణ నిరుపేదలను ఆర్థికంగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా రహదారికి నిధుల మంజూరు చేయాలని ప్రజలు కోరగా పోరా వెళ్లే రహదారికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు పిచ్చెట్టి సత్యనారాయణ, సర్పంచులు సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారావు, నేతలు పాల్గొన్నారు.

ఆచంట : ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రాతళ్లమెరకలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న నరసింహరాజు

కాళ్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి మోసపూరిత మాటలు నమ్మొద్దని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ప్రాతళ్లమెరక గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ టిడిపి జనసేనతో పొత్తు కోసం ఆరాటపడుతోందన్నారు. ప్రాతళ్లమెరకలో వేగేశ్న బాలగణపతి వర్మ ఆధ్వర్యంలో పివిఎల్ నరసింహరాజుకు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాల వల్ల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పివిఎల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స విశ్వనాథరాజు, జెడ్పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు చంటి రాజు, గణేశ్న రాంబాబు, వేగేశ్న బాల గణపతి వర్మ, సాగిరాజు హరి వర్మ, పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచులు గాలి సామ్రాజ్యం, గోళ్ల పండు, ఉప సర్పంచి వేగేశ్న సుమన్ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి విద్యారంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని తద్వారా ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. సోమవారం ఉండి ఐటిఐ కాలేజీలో డైకిన్ ల్యాబ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ యువత ఉద్యోగాలు చేయడానికి దూరప్రాంతానికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చేసే పనిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇపిఎం, ఎంఐడిసి ఎండి అండ్ సిఇఒ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ డైకిన్ సంస్థ ద్వారా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి పట్టణంలో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డైకిన్ ల్యాబ్ ద్వారా శిక్షణ పొందేందుకు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్ఎస్ డిసిజిఎం బి.గోపీనాథ్, డిఎస్డిఒ ఎ.కృష్ణారెడ్డి, సిడాప్ జెడి పార్థసారధి పాల్గొన్నారు.

డైకిన్ ల్యాబ్ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కుష్టు వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వీరవాసరం

స్పర్శ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని పిహెచ్సి, మండలంలో అన్ని సచివాలయాల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ దేవదాసు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరికైనా కుష్టుకు సంబంధించి లక్షణాలుంటే ఎండిటి మందుల ద్వారా తగ్గించుకోవచ్చని వైద్యాధికారిని జి.మణిత్యాగి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, వైద్యాధికారులు ఎన్.మొహసికాతాబ్, హెల్త్ సూపర్వైజర్ జివివి. సత్యనారాయణ, ఆశ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉండి : కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా పిహెచ్సి వైద్యులు పంజా ధర్మతేజ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మతేజ మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనుమానిత కేసులను నమోదు చేసుకుని వారికి కావాల్సిన మందులను అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చన్నారు. అనంతరం ఆశాలతో స్పర్శ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.సాయి చంద్ర, సిహెచ్ఒ కృష్ణకుమార్, పిహెచ్ఎన్ ఈప్సి కుమారి, సూపర్వైజర్ బి.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

వీరవాసరంలో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచి మంగతాయారు

పాలకొల్లు : గాంధీ వర్ధంతి సందర్భంగా ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం పాలకొల్లు అర్బన్ పిహెచ్సిల పరిధిలో సోమవారం నిర్వహించారు. బంగారు వారి చెరువుగట్టు వైద్యులు చంద్రశేఖర్ వ్యాధి లక్షణాలను వివరించారు. వీవర్స్ కాలనీ వైద్యులు జాన్ లియో మాట్లాడారు. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల నయం చేయొచ్చన్నారు. అనంతరం డిపిఎంఒ రాంప్రసాద్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : కుష్టు వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. గ్రామ సచివాలయం వద్ద కుష్టు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీతారామ్ మాట్లాడుతూ గ్రామాల్లో కుష్టు వ్యాధిపై ప్రభుత్వం అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గౌతమ్, ఎఎన్ఎంలు పుష్పరాజ్యం, రమణ ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లి గ్రామంలో సర్పంచి పోతుల అన్నవరం గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా హెల్త్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సర్పంచి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో వాసవి ఆర్చ్ వద్ద జరుగుతున్న సీసీ డ్రెయిన్ పనులను, ట్రాన్స్ఫార్మర్స్ మార్పు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ, లైన్ మెన్, వార్డు మెంబర్లు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : సిద్ధాంతం గ్రామ సచివాలయం వద్ద కుష్టు వ్యాధి నిరూలనపై సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి) మాట్లాడారు. కుష్టు అంటు వ్యాధి కాదని, ప్రజలు దీనిపై అవగాహనా కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదమామిడిపల్లిలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జగన్ ప్రభుత్వ హయాంలో సమస్యలు లేని ఇల్లు లేదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. పెదమామిడిపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్లినా సైకో పోవాలి, సైకిల్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. త్వరలోనే అందరికీ మంచి రోజులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, ఇన్ఛార్జి కౌరు మురళి, గ్రామ అధ్యక్షులు బండి పెద్దిరాజు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

బ్రాహ్మణచెరువులో వరిపొలాల పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరిసాగులో ఆకు ఎండు తెగులు గుర్తించిన వెంటనే పొలంలోని నీటిని బయటకు తీసి 4, 5 రోజులు ఆరబెట్టాలని ఎఒ మద్దాల జయ దుర్గామాధురి అన్నారు. బ్రాహ్మణచెరువులో రైతు గునుపూడి మురళీకృష్ణ వరి పొలాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. మండలంలో పొలాలను సందర్శించినప్పుడు ప్రస్తుతం దాళ్వా 15 నుంచి 30 రోజుల వ్యవధిలో వరి పైరు ఉందన్నారు. అక్కడక్కడా దుబ్బులు చనిపోతున్నాయని గుర్తించామని తెలిపారు. అయితే రైతులు అపోహపడి దుబ్బుకుళ్లు అని చెబుతున్నారన్నారు. దాళ్వా సాగులో ఎంటియు 1121 రకంలో అక్కడక్కడా దుబ్బులు చనిపోతున్నాయని, ఇది బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులుకు సంబంధించిందని తెలిపారు. ఇది మొక్క శాఖీయ దశలో వస్తే దీన్ని క్రసక్ ఫేస్ అని అంటారని తెలియజేశారు. ఆకు ఎండు తెగులు గుర్తించిన వెంటనే పొలంలో నీటిని బయటకు తీసి 3, 4 రోజులు చేను అరగట్టిన తరువాత ప్లాంటా మైసిన్ 50 గ్రాములు, కొసైడ్ 250 గ్రాములు కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెగులు సోకిన వరిచేలను పరిశీలిస్తున్న ఎఒ మద్దాల జయదుర్గామాధురి

ప్రజారోగ్యమే లక్ష్యం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పనిచేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.80 వేల చెక్కును సోమవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ నాడు పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారని తెలిపారు. నేడు ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ పేరిట దాదాపుగా 3,500 వ్యాధులకు పైగానే కార్పొరేటర్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించే సదుపాయాన్ని కల్పించారని తెలిపారు. వైద్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లబ్ధిదారులకు రూ.5 లక్షల రుణం ఇవ్వాలి

ప్రజాశక్తి - పెంటపాడు

జగనన్న గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల రుణం ఇవ్వాలని, కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి కలింగ లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలింగ లక్ష్మణరావు, సిపిఎం నాయకులు సిరపరపు రంగారావు, జనసేన నాయకులు దాసరి శ్రీనివాస్, టిడిపి నాయకులు మార్లపూడి మహేష్ మాట్లాడారు. జగనన్న కాలనీలు జగనన్న కన్నీళ్లుగా మారాయని విమర్శించారు. ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.5 లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో అఖిలపక్షంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బండారు శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు, కొవ్వూరు వెంకటరెడ్డి, బుద్దన నారాయణ రావు, పొనగంటి దుర్గా పాల్గొన్నారు.

కెవికెలో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం

ప్రజాశక్తి - ఉండి

శాస్త్రీయ సలహా సంఘం సమావేశం సోమవారం సాయంత్రం డాక్టర్ భారత లక్ష్మి ఆధ్వర్యంలో కెవికెలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు ఆచార్య ఎన్జిరంగా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్త బి.ముకుందరావు హాజరయ్యారు. తొలుత సమావేశం అధ్యక్షులు డాక్టర్ భరత లక్ష్మి మాట్లాడుతూ పంట కాలానికి ముందు సలహా సంఘం సభ్యులు సమావేశమై కెవికె, ఏరువాక కేంద్రాల ప్రగతిని పరిశీలించి తరువాత కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలన్నారు. అనంతరం డాక్టర్ బి.ముకుందరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా చిరుధాన్యాల ప్రాముఖ్యత ఏర్పడిందని, వాటిని ప్రచారం చేయడంలో దృష్టి సారించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కెవికె, ఏరువాక కేంద్రాలు రైతు భరోసా కేంద్రాల సహకారంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు, కెవికె ప్రధాన శాస్త్రవేత్త డెబోరా మెస్సియానా, మత్స్య పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ టి.నీరజ పాల్గొన్నారు.

జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలి

ఉండి: జంతువులను హింసించరాదని, వాటిపట్ల ప్రేమ కలిగి ఉండాలని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పశు సంవర్ధకశాఖ భీమవరం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ జావర్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఉండి ప్రాంతీయ పశు వైద్యశాల, ఉండి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న హరిబాబు, హుస్సేన్ మాట్లాడుతూ కొన్నిచోట్ల జంతువులు హింసకు గురవుతున్నాయన్నారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.మల్లేశ్వరరావు, కమతం బెనర్జీ, మండల పరిషత్ విస్తరణాధికారి కొండలరావు మాట్లాడుతూ కుక్కలకు వ్యాక్సినేషన్ వేయాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు, కవి, కార్టూనిస్ట్ గాదిరాజు రంగరాజు, పశు సంవర్ధక శాఖ డిడి జావర్ హుస్సేన్, విఎల్ఒ జయలక్ష్మి, ఎహెచ్ఎ.చంటి, రామకృష్ణ, రాకేష్ను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కార్యదర్శి కలిదిండి సీతారామరాజు, రుద్రరాజు నరసరాజు, భూపతిరాజు హరినాథ్ రాజు, ఎం.శివరామరాజు పాల్గొన్నారు. అనంతరం కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 317/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు. ...వాది

మరియు

1) పితాని గాంధీ, తండ్రి: వెంకన్న, 24-15-12, శంభునిపేట, పాలకొల్లు.
2) కట్టా మురళీ, తండ్రి: వెంకటేశ్వరరావు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం. ...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు కట్టినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంధము **ది.10-02-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది. కావున మీరిద్దరూ సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10::30 ని॥లకు హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు మీరు స్వయంగా గాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా గాని తెలుపుకోవలెను.** లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
30-1-23. అడ్వకేట్, తణుకు.